క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం


నాగులాపల్లిలో కోర్టులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్, షటిల్ కాక్ కోర్టులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం సాధన ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సర్పంచ్ జామి చినమ్మలు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, నేతలు దొడ్డి శ్రీనివాసరావు, టిక్కలి పరశురామ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెంచరీ కొట్టిన టమాటా

కశింకోట: తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు ఘాటెక్కాయి. టమాటా సెంచరీకి చేరుకుంది. గత వారం కిలో టమాటా రూ.70 ఉండగా, ఈ వారం రూ.వందకు పెరిగింది. పాదు చిక్కుడుకాయ బెట్టు మీదే ఉంది. కిలో రూ.150కి విక్రయించారు. ఇది రూ.120 నుంచి అదనంగా రూ.30 పెరిగింది. బంగాళదుంప రూ.40, ఉల్లిపాయ రూ.50, బీరకాయ, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయ, బరబాటి రూ.60, గోరు చిక్కుడు రూ.80, క్యాప్సికం రూ.వందకు విక్రయాలు సాగాయి. దసరా సందర్భంగా కోళ్ల అమ్మకాలు, వస్త్రాల అమ్మకాలు జోరుగా సాగాయి.

శాంతియుత ర్యాలీకి అనుమతి కోరుతూ వినతి

నర్సీపట్నం : ఇసుక సమస్యపై ఈ నెల 21న చేపట్టనున్న శాంతియుత ర్యాలీకి అనుమతి కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమ వారం సీఐ ఎల్.రేవతమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ న్యాయ విభాగం ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ సిరసపల్లి నాని, పార్టీ నాయకులు యాదిగిరి శేషు మాట్లాడుతూ నిబంధనల మేరకు పోలీసుల అనుమతి కోరుతూ సీఐకి దరఖాస్తు చేశామన్నారు. ఇసుక విధానంలో లోపం వల్ల భవన నిర్మాణదారులు, భవన నిర్మాణ కార్మికులు నాలుగు నెలలుగా అవస్థలు పడుతున్నారన్నారు. ఇసుక సరఫరా చేయకపోవడం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. గబ్బాడ స్టాక్ పాయింట్‌లోని ఇసుక నిల్వలను కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుత ర్యాలీ చేపట్టామన్నారు.

రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలి


ఆర్అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): కొత్త రోడ్ల నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే విజయకుమార్ కోరారు. అచ్యుతాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ డీఈ రాధాకృష్ణతో పాటు ఇతర ఏఈలతో సోమవారం ఆయన నియోజకవర్గంలోని రహదారులపై చర్చించారు. అయిదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని రహదారులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతులకు గురైన రహదారులను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు.

ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు


ఇసుక రవాణా జరగకుండా జేసీబీతో కాలువ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : చోద్యం వద్ద బొడ్డేరు గెడ్డ వద్ద ఇసుక అక్రమ రవాణా జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆదేశాల మేరకు చోద్యం వద్ద ఉన్న భారీ వంతెన వద్ద ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లు రాకుండా పెద్ద కాలువ ఏర్పాటు చేశారు. వంతెన వద్ద ఇసుక తవ్వకాలు జరగడం వల్ల వంతెనకు ముప్పు ఉందని పలువురు పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలపడంతో ఈ వంతెన వద్ద ఇసుక అక్రమ రవాణా జరగకుండా పెద్ద కాలువలు ఏర్పాటు చేశారు.

అమ్మో.. పూడిమడక రోడ్డు

- భారీ వాహనాల రాకపోకలతో బెంబేలు
- పరిమితికి మించి లోడు కారణంగా ఛిద్రమైన రోడ్డు



పూడిమడక రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

మునగపాక: పూడిమడక రోడ్డులో ప్రయాణం అంటేనే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. పరిమితికి మించి లోడుతో భారీ వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకొస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళనకు గురవుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వందలాది భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుండడంతో చాలా వరకు రోడ్డు పాడైపోయింది. రోడ్డుపై భారీ వాహనాలను నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భారీ వాహనాల వేగానికి కళ్లెమేది?

అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం మీదుగా పూడిమడక రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అచ్యుతాపురంలోని ఎస్ఈజెడ్‌తో పాటు పలు కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు, వ్యాపారాలు పూడిమడక రోడ్డులో ప్రయాణిస్తుంటారు. అయితే ఈ మార్గంలో కొంత కాలం నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాళ్ల లోడుతో లారీలు రేయనక, పగలనక రయ్‌రయ్ మంటూ శబ్దం చేస్తూ దూసుకుపోతున్నాయి. ఒక వైపు భారీ వాహనాలకు అనుమతులు లేవంటూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా.. ఇవేమీ తమకు పట్టనట్లు లారీ డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు పరిమితికి మించి లోడుతో వాహనాలు ప్రయాణిస్తున్నా నిరోధించే వారు కరువయ్యారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయి లోడుతో వెళ్తున్న వాహన డ్రైవర్లు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. రాయి ప్రమాదవశాత్తూ జారిపడి ప్రమాదం సంభవిస్తే బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఛిద్రమైన రహదారి

భారీ వాహనాల రాకపోకల కారణంగా పూడిమడక రోడ్డు ఛిద్రమైంది. గతంలో ఈ రోడ్డు శిథిలావస్థకు గురికావడంతో సమస్య పరిష్కారానికి అప్పటి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు కృషి చేశారు. వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.6.9 కోట్ల మేర నిధులు మంజూరు చేయించారు. దీంతో అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల మేర రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టారు. అయితే పరిమితికి మించి లోడుతో వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు దెబ్బతింటుంది. కొన్ని చోట్ల దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలను నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.


పాడైన పూడిమడక రోడ్డుకు ఇటీవల మరమ్మతులు చేపట్టిన దృశ్యం

వాహనాల రాకపోకలపై నిఘా పెట్టాలి


పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళనగా ఉంది. భారీ వాహనాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. దీనికి తోడు పరిమితికి మించి ప్రయాణం సాగిస్తున్న వాహనాలపై నిఘా పెట్టాలి.

– నరాలశెట్టి సూర్యనారాయణ, ద్విచక్ర వాహనదారుడు, ఒంపోలు

అవగాహన కల్పిస్తున్నాం..


పూడిమడక రోడ్డులో రాకపోకలు సాగించే భారీ వాహన యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. అతివేగం ప్రమాదకరమని చెబుతున్నాం. రాయి లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్లకు పదేపదే చెబుతున్నాం. వేగ పరిమితి తగ్గించాలి. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– పి.ప్రసాదరావు, ఎస్ఐ, మునగపాక

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు


బదిలీపై వెళ్లిన పాటిపల్లి పంచాయతీ కార్యదర్శి మెహర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి అన్నారు. పాటిపల్లి పంచాయతీ కార్యదర్శిగా పని చేసి బదిలీపై వెళ్తున్న మెహర్ ప్రసాద్‌ను సోమవారం సచివాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాటిపల్లి గ్రామాభివృద్ధికి ప్రసాద్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారంలో తగిన కృషి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భీశెట్టి గంగునాయుడు, వార్డు సభ్యులు ఆడారి రామకృష్ణ, దాడి గంగరాజు, కొయిలాడ మోహన్, చిందాడ అప్పారావు, సరిసా శ్రీను, కొయిలాడ సంజీవ్, పెద్దలు ఆడారి త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

యలమంచిలి రూరల్: మూడు నెలలుగా బకాయి పడిన వేతనాలు చెల్లించాలని కోరుతూ యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. వేతనాల కోసం కార్మికులు చేస్తున్న నిరసన సోమవారానికి 47వ రోజుకు చేరుకుంది. పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు చెల్లించకపోతే దసరా పండగ ఎలా జరుపుకొంటామని ప్రశ్నించారు. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు, కిరాణా, అప్పులకు వడ్డీలు ఇలా తాము బతకడానికి వేతనాలు ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 16వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని కార్మికులు హెచ్చరించారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ, తాటిపాకల చిన్న అప్పారావు, మడక శ్రీనివాస్, అనిల్ శ్రీనివాస్, సంతోషి, రత్నం, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

క్షీణించిన పారిశుధ్యం


పాత తంగేడులోని ఓ వీధిలో సీసీ రోడ్డు దుస్థితి

కోటవురట్ల: పాత తంగేడులో పారిశుధ్యం క్షీణించింది. కాలువలు లేకపోవడంతో సీసీ రోడ్లు మురికి కూపంగా మారుతున్నాయి. సీసీ రోడ్లు నిర్మించినప్పుడు డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ఈ సమస్య తలెత్తుతోంది. ఎన్నో ఏళ్లుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లల్లో వాడుకనీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగునీరు చేరడంతో రోడ్లు నాచు పట్టి అధ్వానంగా తయారయ్యాయి. రాత్రి వేళల్లో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురికి కూపం కారణంగా దోమలు వ్యాప్తి చెందిన రోగాల బారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భజనలు, సామూహిక హారతులు నిర్వహించాలి

పాయకరావుపేట: ఆలయాల్లో ప్రతి వారం భజనలు, సామూహిక హారతులు, నగర సంకీర్తనలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మ ప్రచారక్ ముద్దు సాయిరాం కోరారు. గోపాలపురంలో ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ల శిక్షణ సమావేశం సోమవారం జరిగింది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల నుంచి గ్రామ కన్వీనర్లు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ గ్రామాల్లో 22 మందితో గ్రామ ధార్మిక సమితి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఆ కమిటీలతో పూజా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాబోయే ధనుర్మాసంలో ప్రతి గ్రామంలో తెల్లవారుజామున మేలుకొలుపులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయోజక్ చంద్రమాల కొండయ్య, సమన్వయ ప్రముఖ పోతు రంగారావు, సబ్ డివిజన్ సంయోజక్ నీలాపు వెంకటరెడ్డి, మండల మహిళా కన్వీనర్ కోనాడ చిట్టిమ్మ, మండల కమిటీ సభ్యులు జగతా శ్రీనివాస్, గ్రామ కన్వీనర్ ముణాసల సూరిబాబు, జిల్లా ధర్మ ప్రచారక్ మైలపల్లి శ్రీను, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముద్దు సాయిరాం

డీఎల్‌పురంలో కేంద్ర బృందం పర్యటన

నక్కపల్లి: స్నేహ పూర్వక బాలల పంచాయతీగా నామినేట్ అయిన డీఎల్ పురం గ్రామాన్ని సోమవారం కేంద్రం పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పంచాయతీ కార్యాలయాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. భోజన సదుపాయాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. స్నేహ పూర్వక బాలల పంచాయతీగా నామినేట్ కావడంతో త్వరలో ఉన్నత స్థాయి బృందం గ్రామంలో పర్యటిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామ్, ఏవోలు కుంచం నరేష్, వి.నూకరాజు, కార్యదర్శి నర్సింహారావు, సర్పంచ్ కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు చంద్రరావు, కనకారావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ఎంపీడీవోగా ఉషారాణి బాధ్యతల స్వీకరణ

మునగపాక: మునగపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.ఉషారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పని చేసిన మన్మథరావును శ్రీకాకుళంకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో డుంబ్రిగుడ ఎంపీడీవోగా పనిచేసిన ఉషారాణిని మునగపాకకు బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఆమెకు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీవో ఉషారాణి మాట్లాడుతూ మునగపాక మండలాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


మునగపాక ఎంపీడీవో ఉషారాణిని అభినందిస్తున్న దృశ్యం

మహాచండీ అలంకరణలో దుర్గమ్మ


అడ్డురోడ్డు తిమ్మాపురంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు


వాడ్రాపల్లిలో దుర్గాదేవి అమ్మవారి అంబలం పూజ

ఎస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు తిమ్మాపురం పాతపంచాయితీ వద్ద కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు సోమవారం మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వంగలపూడి రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీఠం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాక్లెట్ బాయ్స్ సభ్యులు భక్తులకు సహాయ సహకారాలు అందించారు.

ఘనంగా దుర్గాదేవి అమ్మవారి అంబలం పూజ

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం రాత్రి దుర్గాదేవి అమ్మవారి అంబలం పూజ ఘనంగా జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవానీ భక్తులు ఏర్పాటు చేసిన అంబలం పూజకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జై దుర్గా.. జైజై దుర్గా అంటూ నినదించడంతో పాటు డప్పువాయిద్యాలకు అనుగుణంగా గీతాలు ఆలపించారు.


హరిపాలెం శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయంలో పూజలు

దుర్గాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలంలోని పలు దుర్గాదేవి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హరిపాలెం-అందలాపల్లిలోని భగీరథమ్మ అమ్మవారిని వ్యాపారవేత్తలు కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్ దర్శించుకున్నారు. హరిపాలెం హిమగిరి కొండపై కొలువుదీరిన శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి

ఆర్డీవో వి.వి.రమణ


అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మండలస్థాయి అధికారులను ఆర్డీవో వి.వి.రమణ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. డివిజన్‌లోని పలు మండలాల నుంచి వివిధ సమస్యలపై 14 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో పేర్కొన్నారు. ప్రతి అర్జీకి అధికారులు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పరిష్కరించేందుకు వీలుకాకపోతే కారణాన్ని లిఖితపూర్వకంగాఅర్జీదారుడుకి తెలియజేయాలన్నారు. ఫిర్యాదులను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

ఈదురుగాలులతో వర్షం

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వారాడ, ఆనందపురం, ఎ.కోడూరు, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో మధ్యాహ్నం ఒక్కసారి గా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షంతో సాగులో ఉన్న వరిపంటకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

చేప పిల్లల కేంద్రం ఫినిష్!

- తాండవలో గతంలో ప్రతి ఏటా కోటి 25 లక్షలకు పైగా పిల్లలు ఉత్పత్తి
- ఉమ్మడి జిల్లాలో మత్స్యకార సంఘాలకు సరఫరా
- ఈ ఏడాది నిధులు మంజూరు చేయక నిలిచిన చేప పిల్లల ఉత్పత్తి


తాండవలోచేప పిల్లలు పెంచేందుకు ఏర్పాటు చేసిన నీటి కుండీలు

నాతవరం : ఉమ్మడి జిల్లాలోనే తాండవలో గల ఏకైక చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం నేడు నిర్లక్ష్యపు నీడలో దర్శనమిస్తుంది. భవనాలు శిథిలం అవుతున్నాయి. సిబ్బంది లేక కార్యాలయం మూసి ఉంటున్నది. నిధులు మంజూరు చేయక చేప పిల్లల ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. తాండవ రిజర్వాయరు దిగువ ప్రాంతంలో 1984లో మండలంలో చమ్మచింత పంచా యతీ పరిధిలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పట్నుంచి ప్రతి ఏటా జూలై ఆగస్టు నెలలో చేప పిల్లలు కేంద్రంలో కృత్రిమ ఉత్పత్తి ద్వారా కోటి 25లక్షలు వివిధ రకాలు చేప పిల్లలను ఉత్పత్తి చేస్తుంటారు. పెద్ద చేపలకు హార్మోన్లు అభివృద్ధికి ఇంజక్షన్లు చేసి కృత్రిమ ఉత్పత్తి ద్వారా చేప పిల్లలను ఉత్పత్తి చేసి వాటిని మత్స్య సహకార సంఘాలకు సరఫరా చేస్తుంటారు. మత్స్య సహకార సంఘాలకు సరఫరా చేయగా మిగిలిన పిల్లలను జిల్లా వ్యాప్తంగా ఉన్న తాండవ, రైవాడ, కల్యాణపులోవ, కోనాం, వరాహ, మేహాద్రిగెడ్డ , రావణాపల్లి రిజర్వాయర్లలో విడుదల చేసేవారు. చెరువుల్లో పెంచుకునేందుకు ప్రైవేటు వ్యక్తులకు కూడా విక్రయాలు జరిపేవారు. అంతంటి ప్రాముఖ్యం కలిగిన తాండవలో గల చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రంలో ఈ ఏడాది మచ్చుకైనా చేప పిల్లలు ఉత్పత్తి చేయలేదు. నిత్యం మత్స్య సహకార సంఘాల సభ్యులు, అధికారులతో కళకళలాడే ఉత్పత్తి కేంద్రంలో సిబ్బంది జాడే కన్పించలేదు. ఇటీవల కాలంతో ఎప్పుడు చూసినా తాండవ చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం మూసి ఉంటుంది. చేప పిల్లలు ఉత్పత్తి చేసేందుకు నిర్మించిన నీటి కుండీలు నీటితో నిండుగా కన్పిస్తున్నాయి. నీటి కోసం కేంద్రంలో ఏర్పాటు చేసిన బోరుని ఉపయోగించక మరమ్మతుకు గురై అడవిని తలపించేలా పెరిగిన పిచ్చి మొక్కల మధ్య కన్పించకుండా ఉంది. అధికారులు లేకపోవడంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం శిథిలమై గేట్లు ఊడి పోయి భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. కిటికీలు, తలుపులు, చెదలు పట్టి అధ్వానంగా ఉండడంతో అందులో విషసర్పాలు సయ్యాటలు ఆడుతూ ఉండడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. గతంలో ఇక్కడ పని చేసే సిబ్బంది పదవీ విరమణ చేయగా, కొందరు ఇక్కడ నుంచి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఈ కేంద్రం నర్సీపట్నం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో నడుస్తుంది. వారు కూడా ఈ కేంద్రానికి వచ్చిన దాఖలాలు లేవు. దీంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం మునుగడ పూర్తిగా కనుమరుగైనట్టుగా ఈ ప్రాంతీయులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై నర్సీపట్నం మత్స్యకార అభివృద్ధి అధికారి నాగమణిని వివరణ కోరగా చేప పిల్లలు ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదన్నారు. గతంలో ఉండే సిబ్బంది ప్రస్తుతం లేరన్నారు. ఇతర ప్రాంతాలు నుంచి తెచ్చిన 12 లక్షలు చేప పిల్లలను తాండవ రిజర్వాయరులో విడుదల చేశామన్నారు.

అంగన్‌వాడీ యాప్‌లను రద్దు చేయాలి

సీడీపీవో ప్రభావతికి వినతి

అనకాపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకువచ్చిన యాప్‌లన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్పు చేయాలని, రికార్డు వర్కు తగ్గించాలని, ఏడు నెలల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ఏఎఫ్‌ఆర్ఎస్ రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డివిజన్ నాయకులు కె.తనూజ, జ్యోతి, వరలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక సీడీపీవో కార్యాలయంలో సోమవారం సీడీపీవో పి.ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు లబ్ధిదారుల జాబితాను పోషణా ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్‌లో నమోదు చేస్తున్నామని, గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్‌ఎస్ ద్వారా టి.హెచ్.ఆర్ అందిస్తున్నామని, మరలా ఐదు రకాల రికార్డుల రాయాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం రికార్డులు ఇవ్వలేదని, ఒక్కొక్కరు రూ.వెయ్యి నుంచి రూ.1200 ఖర్చు పెట్టుకుని రికార్డులు కొనుగోలు చేయడం వల్ల ఆర్థిక భారంగా మారిందన్నారు. రకరకాల పనుల వల్ల ప్రీ స్కూల్ పిల్లలకు సకాలంలో బోధన ఇబ్బందిగా ఉందన్నారు.


సీడీపీవో ప్రభావతికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

ఏనుగుతునిలో దసరా సంబరాలు


బాణాలు ఎక్కు పెట్టిన విద్యార్థులు

కశింకోట: ఏనుగుతుని గ్రామంలో విద్యార్థులు సోమవారం దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాలు పట్టుకొని గ్రామ పెద్దలతోపాటు కలిసి ఇంటింటికీ వెళ్లి సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు అంటూ దసరా పాటలు పాడారు. బాణాలతో ఇళ్లలోకి పూలు, ఆకులు వేసి సంబరాలు చేశారు. హెచ్ఎం శర్మ, స్కూలు కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, వైస్ చైర్మన్ స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.